అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం 22 ఏప్రిల్ 2023

జేసీబీ, ట్రాక్టర్‌లు సీజ్

- మట్టి తవ్వకాలు చేపడుతుండటంతో పట్టుకున్న ఎమ్మార్వో

నవతెలంగాణ-బిచ్కుంద


ట్రాక్టర్, జేసీబీని స్వాధీనం

బిచ్కుంద మండలంలోని మల్కాపూర్ శివారులో గల తంబలకుంట చెరువులో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతున్న జేసీబీ, మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌లను తహసీల్దార్ భరత్ శుక్రవారం పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భారత్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తరలించినా, మొరం, మట్టి తవ్వకాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టంచేశారు. ఆయన వెంట పోలీస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

24 నాటి ప్రజావాణి తాత్కాలిక వాయిదా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ బృందం జిల్లా పర్యటనకు విచ్చేస్తోందని, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మీటింగ్ హాల్ లో అధికారులతో సమీక్ష, సెమినార్ కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. మహిళా కమిషన్ పర్యటన దృష్ట్యా సోమవారం రోజున జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

గాలిదుమారం



- ఉరుములు, మెరుపులతో వర్షం
- మామిడి తోటలకు తీవ్ర నష్టం
- నేలకొరిగిన వరి.. విరిగిన చెట్లు

నవతెలంగాణ-విలేకరులబృందం


కమ్మర్‌పల్లిలో నేలవాలిన పంట


నిజామాబాద్ నగరంలో ఉరుములు మెరుపులు

మధ్యాహ్నం వరకు తీవ్ర భానుడు ప్రతాపం చూపగా.. సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణం చల్లబడగా.. రాత్రి వేళ ఈదురుగాలులు వీచాయి. దీనికి తోడు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గతంలో ఎన్నడూ ఎరగనంత వేగంగా ఈదురుగాలలు వ్యాపించడంతో పలు చోట్ల చేతికొచ్చిన వరి నేలకొరగా.. కోత దశలో ఉన్న మామిడికాయలు నేలరాలాయి. దీంతో పాటు రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం వర్షంతో తడిచి ముద్దయింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నష్టం వాటిల్లింది.

నేల వాలిన మామిడి, నువ్వు, వరి, సజ్జ పంటలు

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండలంలో గురువారం అర్ధరాత్రి బలంగా వీచిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షం స్వల్పంగానే కురిసినా సుమారు గంట పాటు బలంగా వీచిన గాలుల తీవ్రతకు నష్టం ఎక్కువగా వాటిల్లింది. ముఖ్యంగా వరి కోతల సాగుతున్న వేళ ఈదురు గాలులతో కొన్ని గ్రామాల్లో వరి పంట నేలవాలగా, మరి కొన్నిచోట్ల వడ్లు నేలరాలాయి. పంట చేతికి వచ్చే దశలో అకాల వర్షాలతో పంట నష్టం జరగడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట దిగుబడి తగ్గడంతోపాటు నాణ్యత తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పెద్ద ఎత్తున సాగు చేస్తున్న నువ్వు పంటకు కూడా అకాల వర్షాల వల్ల నష్టం వాటిల్లుతుంది. బలమైన గాలులకు వారం పది రోజుల్లో కోత దశలో ఉన్న నువ్వు పంట పెద్ద మొత్తంలో నేల వాలింది. పంట బాగుందని ఎంతో ఆశ పెట్టుకున్నా నువ్వు పంట నేల వాడడంతో తమ ఆశలు అడియాశలయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల సజ్జపంట సైతం నేల వాలింది.

మామిడి తోటలకు భారీ నష్టం

బలమైన ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో మామిడి తోటలకు భారీ నష్టం వాటిల్లింది. కోత దశలో చేతికి వచ్చిన మామిడి తోటలు గాలివాన పాలు కావడంతో నష్టాలే మిగులుతాయని రైతులు వాపోతున్నారు. మామిడికాయ తెంపడానికి సిద్ధంగా ఉన్న పరిస్థితుల్లో అకాల ఈదురు గాలులతో 50 శాతం కాయ నేలరాలినట్లు మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడికాయ రాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లడంతో లబోదిబోమంటున్నారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన మామిడి రైతును రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మండల కేంద్రానికి చెందిన మామిడి రైతు ఆకుల బాలకృష్ణ కోరారు. 15 ఎకరాల్లో మామిడి తోటకు నష్టం వాటిల్లినట్టు ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి మండలంలో విద్యుత్ సరఫరా కూడా అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది గంటల తరబడి శ్రమించి విద్యుత్తును పునరుద్ధరించారు.

మోపాల్ : మండలం వ్యాప్తంగా పలు చోట్ల వరి నేలవాలింది. కల్లాలపై ఉన్న ధాన్యం తడిసింది. రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లు ఇవ్వకపోవడంతో ఆరబెట్టిన ధాన్యం వర్షం ధాటికి తడిచి ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని, లారీలను సకాలంలో పంపిస్తూ ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంతో పాటు మంగల్‌పాడ్, తానాకలాన్ తదితర గ్రామాల్లో సుమారు గంటపాటు వర్షం కురిసింది. దీంతో రోడ్డుమీద ఆరబెట్టిన ధాన్యం తడిచి ముద్దయింది. తుమ్మ చెట్టు విరిగి రోడ్డుపై పడింది. ఎడపల్లి ఐకెపి కార్యాలయం ఎదుట రైతులు ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. తహసీల్దార్ శేఖర్, నాయబ్ తహసీల్దార్ నారాయణ, ఆర్ఐ ప్రభు భూపతి, మండల వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధి రామేశ్వరరావు మండల వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారులు జ్యోతి, సప్తగిరి, పార్థి సెంటర్లోని క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంటను పరిశీలించారు.

తడిసిన ధాన్యం పరిశీలించిన అధికారులు

రెంజల్ : రెంజల్ మండలం వ్యాప్తంగా ఈదురుగాలుల ధాటికి నేలకొరిగిన వరి పంటను, వర్షానికి తడిచిన ధాన్యాన్ని అధికారులు పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ శశిభూషణ్, ఏపీడి మధుసూదన్, మార్కెటింగ్ డిపిఎం సాయిలు శుక్రవారం ధాన్యం రాశులను పరిశీలించారు. నింపిన బస్తాలు ఆరబెట్టాలని, తడిసిన ధాన్యాన్ని తిరిగి ఎండ పెట్టాలని రైతులకు వారు సూచించారు. అవసరమైతే రైస్ మిల్లులతో చర్చించి రైతులకు ఎలాంటి అవసరం కలగకుండా ధాన్యం విక్రయించేలా తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. వారి వెంట ఏపిఎం చిన్నయ్య, వ్యవసాయ విస్తీర్ణ అధికారి అజయ్, ఆర్ఐ రవి, తస్లీమా తదితరులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో నేలరాలిన మామిడికాయలు

మాక్లూర్ : మండలంలో గాలి దుమారంతో కూడిన వర్షానికి పలు చోట్ల పంటలకు నష్టం వాటిల్లింది. శుక్రవారం ఉదయం మామిడి తోటలో ఎక్కడ పడితే అక్కడ మామిడికాయలు రాలిపోయాయి. వరి పొలాలు నేలకొరిగాయి.

ఐదు రోజులు భారీ వర్షం

కంఠేశ్వర్ : రానున్న 5 రోజుల పాటు భారీ వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ అధికారి ప్రతాప్ తెలిపారు. వడగండ్ల వాన పడే అవకాశం ఉన్నట్టు తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలతోపాటు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీయనున్నట్లు వెల్లడించారు. రైతులు తమ ధాన్యం వర్షంపాలుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు.

కృష్ణనగర్‌లో గాలి దుమారానికి 33 కేవి లైన్ కిందపడి పశువుల గడ్డి వాము కాలిపోయింది. స్థానికులు మంటలు ఆర్పడానికి బిందెలతో, బకిట్లతో నీరు పోసి ఆర్పినా మంటలు తగ్గకపోవడంతో అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.


మోపాల్‌లో నేలవాలిన వరి


రెంజల్‌లో తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న అధికారులు

నేడు రంజాన్

- నెలవంక కనువిందు
- శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్


ప్రార్థనలకు ఏర్పాట్లు

సౌదీలో గురువారం నెలవంక కనిపించడంతో నేడు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు ముస్లింలు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పురస్కరించుకొని సామూహిక ప్రార్థనలకు సర్వం సిద్ధమైంది. ఉదయం సహర్‌తో ప్రారంభించి, ఇఫ్తార్ విరమణలతో కొనసాగిన 'రోజా' ఉపవాసాలకు సెలవు పలికారు. రంజాన్ పురస్కరించుకొని మార్కెట్‌లో గతం వారం రోజుల నుంచి సందడి నెలకొంది. గాంధీచౌక్, నెహ్రూ పార్క్, బోధన్ రోడ్డు కొనుగోలు దారులతో కిక్కిరిపోయాయి.

రంజాన్ పురస్కరించుకొని మంత్రివేముల ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి చక్రపాణి

నవతెలంగాణ-బోధన్



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయిగా ఉన్న పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి చక్రపాణి డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డిఓ రాజేశ్వర్‌కు ఆయన కార్మికులతో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతన జి.ఒ అమలు చేయాలని, ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని, బకాయి బిల్లులు చెల్లించాలని, మౌళిక సదుపాయాలు, స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వేలాది మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. బిల్లులు సకాలంలో అందక కార్మికులు అప్పులు చేసి పథకాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానం వల్ల కార్మికులందరూ అప్పుల పాలవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించలేని ఎడల రాబోయే కాలంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు భూమయ్య ,రాజు, శ్యామ్ రావు ,సావిత్రి, విజయ, పుష్ప ,రమణమ్మ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో సిబ్బంది కొరత

నవతెలంగాణ-కామారెడ్డి



నిజాంసాగర్ మండల కేంద్రం లోని విద్యుత్ శాఖ కార్యాల యంలో సిబ్బంది కొరత ఉండటం వల్ల మండల కేంద్ర ప్రజలు ఇబ్బందు లకు గురవుతున్నారు. మండల కేంద్రంలో గల సబ్ స్టేషన్ నందు విధులు నిర్వహించేదుకు ప్రధానంగా జేఎల్‌ఎం, లైన్ మెన్ సిబ్బంది ప్రభుత్వం భర్తీ చేయక పోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువగా ఉండటం వల్ల తరచుగా విద్యుత్ తీగలకు కోతులు ఎక్కి ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.అసలే ఎండాకాలం ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతో సిబ్బంది లేక ఉన్న సిబ్బందిపై పని భారం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీంతో ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెగ్యూలర్ చేయకుంటే సమ్మెకే..


కలెక్టరేట్‌కు వచ్చిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

- కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నాలుగేండ్ల ప్రొబేషన్ అనంతరం తమను రెగ్యూలర్ చేస్తామని హామీ మేరకు జీవో విడుదల చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్‌లు) కోరారు. లేకుంటే ఈ నెల 28వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట ప్రభుత్వం వెంటనే రెగ్యూలరైజేషన్ చేయాలని జూనియర్ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరే ట్ ఎదుట నిరసన చేపట్టి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిం చిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో అమలు చేస్తూ గ్రామలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో ఎంతో బాధ్యతగా ప్రతీ పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తు న్నామని తెలిపారు. గ్రామాలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు రావడంలో పంచాయతీ కార్యదర్శులే కీలక పాత్ర పోషించామని, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన 4 సంవత్సరాల గడువు పూర్తి అయినప్పటికి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యూలరైజేషన్‌కు సంబంధించిన ఎటువంటి ఉత్తర్వులు వెలువడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు ఈనెల 13న సమ్మె నోటీసు ఇస్తూ 15 రోజుల నోటీసు పీరియడ్ అనంతరం ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవ డంతో ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మెకు చేపడుతా మని వివరించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శు లను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీఓ విడుదల చేయాలనీ కోరారు. గడిచిన 4 సంవత్సరాల ప్రొబేషన్ కాలాన్ని సర్వీసు కాలంగా గుర్తించాలనీ, ప్రస్తుతం పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను అందరినీ జెపిఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ పని చేసిన కాలాన్ని ప్రొబేషన్ పిరియడ్ లో భాగంగా పరిగణించాలనీ కోరారు. వారిని కూడా రెగ్యూలర్ చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంత్ ను నిర్ధారించి ప్రకటించాలనీ అన్నారు. మరణించిన జేపీఎస్ కుటుంబా లకు కారుణ్య నియమాకాలు చేపట్టి ఆదుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలరైజేషన్ చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ అధ్యక్షులు సుంగా అనిల్, ప్రధాన కార్యదర్శి భానుక చంద్రశేఖర్, కోశాధికారి సుమన్, గౌరవ అధ్యక్షులు హనుమాన్ రాజు, ఉపాధ్యక్షులు హే, కృష్ణవేణి, గౌతమి, బాలకృష్ణ సాయి కుమార్ రామా గౌడ్, సుమారు 200 మంది కార్యదర్శులు పాల్గొన్నారు.

గల్లిగల్లికీ అడ్డాలు..!



- జిల్లాలో ఆగని గంజాయి దందా
- నివారించడంలో అధికారుల నిర్లక్ష్యం.?
- జిల్లా వ్యాప్తంగా జోరుగా విక్రయాలు
- పలు పాన్‌షాపుల్లో అర్ధరాత్రి వరకూ విక్రయాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్



గతంలో గంజాయి సరఫరా జిల్లా, డివిజన్, మున్సిపల్ కేంద్రాలకే పరిమితం కాగా... ఈ మధ్య కాలంలో గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. కొన్ని ప్రాంతాలను అడ్డాగా చేసుకొని దందా కొనసాగిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెప్పిస్తూ స్థానికంగా ఉన్న వారు గుట్టుగా విక్రయాలు చేపడుతున్నారు. యువతే లక్ష్యంగా గంజాయి విచ్చలవిడిగా సరఫరా జరుగుతోంది. గంజాయి సేవించిన మత్తులో యువత అనేక నేరాలకు పాల్పడుతున్నారు. కాగా పలు షాప్‌లలో సైతం గుట్టుగా విక్రయాలు కొనసాగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. రెగ్యూలర్‌గా వచ్చే వారికి అర్ధరాత్రిళ్ల వరకూ అందజేస్తున్నట్టు వినికిడి. ఇంత జరుగుతున్నా.. పోలీస్, ఎక్సైజ్ శాఖాధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా గంజాయి విచ్చలవిడిగా పెరిగిపోవడంపై జిల్లా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సైతం ఆందోళన వ్యక్తం చేశారు. పకడ్బందీగా నిఘా పెట్టి గంజాయి సరఫరా చేస్తున్న వారిని పట్టుకోవాలని పలు మార్లు సమీక్షలు సైతం నిర్వహించారు. ఆదేశాలు జారీ చేసినప్పుడు తనిఖీలు చేపడుతూ పట్టుకుంటుండగా.. ఆ తర్వాత షరామామూలే.

గంజాయి సరఫరా గుట్టుచప్పుడు కాకుండా చాపకింద నీరులా నిజామాబాద్ జిల్లాలో పాకుతోంది. గల్లీలు, గ్రామాల్లో ప్రత్యేక అడ్డాలు ఏర్పాటు చేసుకొని విచ్చలవిడిగా సరఫరా సాగుతున్నట్టు సమాచారం. గంజాయికి అలవాటు పడుతున్న పలువురు యువత పెడదోవ పడుతున్నారు. దీంతో క్రైమ్ రేట్ పెరుగుతోంది. చిన్నచిన్న కారణాలకు, ఈజీ మనీ కోసం హత్యలకు, చోరీలకు పాల్పడుతున్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కంఠేశ్వర్, గౌతమ్ నగర్, దుబ్బ, రైల్వే ట్రాక్, అర్సపల్లి, ఆటోనగర్, బాబన్సపహాడ్, నాగారం, వినాయక్ నగర్, ఆర్య నగర్, వర్ని చౌరస్తా ఇలా చెప్పుకుంటూ పోతే 60 డివిజన్లలో సుమారు వందకు పైనే అడ్డాలుగా ఉన్నట్లు సమాచారం. ఆఖరికి పాన్ షాప్‌లలో కూడా అమ్ముతున్నట్లు సమాచారం. దీంతో రాత్రి వేళల్లో పలు పాన్ షాపుల ఎదుట పలువురు క్యూ కడుతున్నారు. రెగ్యూలర్ వచ్చే వారికే గంజాయి విక్రయాలు చేపడుతున్నట్టు సమాచారం.

పల్లెల్లో యువత భయంకరమైన గంజాయికి బానిసలవుతున్నారు. ఎలాంటి కేసులనైనా క్షుణ్ణంగా ఛేదించే పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఈ విషయంలో మాత్రం వెనకడుగు వేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు చేష్టలుడిగి అచేతనంగా మారిపోయినట్టు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం కల్తీకల్లు, వైన్స్‌లు, బెల్టుషాపులు ఇలా నెలనెలా వీటి నుంచి వచ్చే మామూళ్ల మత్తులో మునిగిపోయి యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఒకప్పుడు పోలీస్, ఎక్సైజ్ శాఖలు కలిసి గంజాయి సాగుపై కఠినంగా వ్యవహరించి ఎప్పటికప్పుడు దాడులు చేసి నిర్మూలించగలిగినా.. సరఫరాను మాత్రం కట్టడి చేయలేకపోతున్నారు.

పంటల మాదిరిగా సాగయ్యే గంజాయిని పోలీసుల ఉక్కు పాదంతో అరకట్టారు. పోలీసులు కఠినంగా వ్యవహరించడం, గంజాయి సాగు చేసే గ్రామాల్లో అవగాహన కల్పించడం ఓ యజ్ఞంలా చేపట్టారు. ఫలితంగా కొన్నేళ్లలోనే జిల్లాలో గంజాయి సాగు లేకుండా పోయింది. నేడు ఒక్క గంజాయి మొక్క కూడా దొరకకుండా పోయింది. సాగునే నిర్మూలించిన పోలీసులు, నేడు ఎందుకు గంజాయి అక్రమ రవాణా, సేవనంను అరికట్టలేకపోతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా గంజాయి సరఫరా జోరుగా సాగుతున్నట్టు సమాచారం. మళ్ళీ ఈ గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది ఎలా తయారవుతుంది కూడా తెలవడం లేదు.

గాంజావాలా కనుసన్నల్లో..

గాంజావాల కనుసన్నల్లోనే సరఫరా 7 అనేక ఏళ్లుగా జిల్లాకు గంజాయి సరఫరా ఆగకుండా జరుగుతోంది. నిరాటంకంగా రవాణాకు జిల్లా కేంద్రంలోని ఓ గాంజాల గంజాయి స్మగ్లింగ్‌కు పెట్టింది పేరుగా నిలిచాడు?. విశాఖపట్నం నుంచి నేరుగా నిజామాబాద్, అక్కడి నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిపోతుంది. ఇదంతా గంజావాల కనుసన్నల్లోనే జరుగుతోందని సమాచారం. గతంలో గాంజవాలపై చర్యలు తీసుకున్నప్పటికీ మళ్ళీ సమస్య మొదలయ్యింది.

మంత్రి వేముల పలుమార్లు సమీక్ష

విచ్చలవిడిగా గంజాయి సరఫరా, వాడకంపై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సైతం ఆందోళన వ్యక్తం చేశారు. గత సీపీ నాగరాజ్ ఉన్న సమయంలో కేవలం గంజాయి నిర్మూలించడంపైనే పలుమార్లు సమీక్ష నిర్వహించారు. మండలాల్లో ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశాల మేరకు రెండుమూడు రోజులు క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతుండగా.. పలువురు సరఫరా దారులు పట్టుబడుతుండగా.. తర్వాత తనిఖీలు చేపట్టకపోవడంతో మళ్లీ కథ మొదటికి వచ్చింది. కేవలం సమాచారం వచ్చినప్పుడు తనిఖీలు చేసి పట్టుకోవడమే కాకుండా నిరంతరం తనిఖీలు చేపడుతూ.. సరఫరా ఎక్కడి నుంచి జరుగుతుందో కూపీ లాగాలని ముఠా గుట్టు రట్టు చేసి గంజాయిని జిల్లాలో నిర్మూలించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశపరీక్ష

నవతెలంగాణ-మోపాల్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో 2023- 2024 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతిలో ప్రవేశంకోసం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కంజర, నిజామాబాద్ ప్రిన్సిపల్ జి మాధవి లత తెలిపారు. విద్యార్థులు www.tg.cet.gov.in వెబ్సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. విద్యార్థులు రెండు గంటల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు. పరీక్ష ప్యాడ్ బ్లూ అండ్ బ్లాక్ పెన్నులు, మాస్క్, వాటర్ బాటిల్‌ను వెంట తీసుకొని రావాలని తెలిపారు. హాల్‌టికెట్లో ఏదైనా తప్పులు ఉన్నట్లయితే దానికి సంబంధించిన ధ్రువపత్రాలను వెంట తీసుకొని రావాలని సూచించారు.

రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఇంచార్జి సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రంజాన్ పండుగను పురస్కరించుకుని నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్, నిర్మల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లప్పుడు ప్రజలు పోలీస్ సిబ్బంది స్నేహపూర్వకంగా సోదర భావంతో మెలిగి అందరు సుఖ సంతోషాలతో సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలని పేర్కొన్నారు. పండగ శాంతియుత వాతావరణంలో జరిగేందుకు నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా బందోబస్తును ఏర్పాటు చేశారు. అన్ని మజీద్‌లవద్ద ముందస్తుగా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి సైతం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

రెండు సెంటర్లు తగ్గించాం

- సెర్ప్ మండల ఏపీఎం

కుంట గంగాధర్

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

మండలంలో ఈ సంవత్సరం ఐకెపి ఆధ్వర్యంలో రెండు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తగ్గించామని సెర్ప్ మండల ఏపిఎం కుంట గంగాధర్ తెలిపారు. హసకొత్తూర్ గ్రామంలో ఐకెపి ప్యాడి సెంటర్ ఓపెన్ చేయాలని కోరుతూ కొంతమంది రైతుల పేరిట ఒక లేఖ విడుదల చేసినట్టు తెలిసిందని పేర్కొన్న ఆయన ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హసకొత్తూర్ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నారని, అదనంగా రైతుల సౌకర్యార్థం మరో కాంటా కూడా ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయం సొసైటీ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్‌తో కూడా మాట్లాడామని పేర్కొన్నారు.

ఐకెపి సిబ్బందికి మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడం, వాటి రికవరీ, 918 స్వయం సహాయక సంఘాలు, 29 గ్రామ సమాఖ్యలు, ఒక మండల సమాఖ్య సంఘాల నిర్వహణ, స్వయం సహాయక సంఘ సభ్యులలో ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల ఏర్పాటు, స్త్రీనిధి వంటి పలు రకాల కార్యక్రమాలు ఉన్నాయని తెలిపారు. సొసైటీ వాళ్ళ సర్వీస్ ఇవ్వలేని చోట అదనంగా ఐకెపి సెంటర్లను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం హాస కొత్తూర్ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో సేవలు అందిస్తూ, మరో అదనపు కాంటా కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారని, అందుకే ఈ సీజన్లో ఐకెపి వారు తప్పుకున్నారని తెలిపారు. ఈ విషయంలో కొన్ని రాజకీయ పక్షాల వారు, కుల సంఘాల వారు సిబ్బందికి ఇబ్బంది కలిగించ వద్దని విజ్ఞప్తి చేశారు.

అవినీతిపై ప్రశ్నిస్తే ఐకేపీ సెంటర్ ఎత్తేస్తారా?

- హాసకొత్తూర్ రైతుల ప్రశ్న

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో ఐకెపి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అవినీతిపై ప్రశ్నిస్తే ఎత్తేస్తారా? అని గ్రామానికి చెందిన రైతులు ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు మాట్లాడారు. గ్రామంలో పది సంవత్సరాల నుండి ఐకెపి మహిళా సంఘాల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. అయితే గత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం తూకం వేసే విషయంలో అందులో తీసిన తరుగు, హమాలీ ఎక్కువ వసూలు చేయడంలో జరిగిన అవినీతి అక్రమాలపై నిలదీసి ప్రశ్నించి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి రికవరీ చేయడం జరిగిందని రైతులు తెలిపారు. ప్రస్తుతం వరి ధాన్యం కోతలు నడుస్తున్నందున ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించమని అడిగితే ఏర్పాటు చేయడం లేదని రైతులు ఆరోపించారు. వరి కోసి, ఆరబెట్టి, కుప్పలు పోసి సెంటర్ కోసం ఎదురు చూస్తున్నామన్నారు. అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి చొరవ చూపి గతంలో లాగా ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, రైతులంతా కలిసి రోడ్డెక్కి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతులు పడిగెల ప్రవీణ్, బద్దం రాకేష్, గోపిడి లింగారెడ్డి, ఏనుగు మనోహర్, బంగ్లా శివ, అయోధ్య మురళి, గడ్డం సంతోష్, గడ్డం విశాల్, సామ మహిపాల్, శ్రావణ్, అనంత్, రమేష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-మోపాల్



కంటి వెలుగు శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్

మండలంలోని కస్బాగ్ తండాలో సర్పంచ్ వసంత ప్రకాష్ కంటి వెలుగు ప్రోగ్రాంను శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ఈ కంటి వెలుగు శిబిరంలో కంటి సమస్యలను నివారించుకోవాలని అన్నారు. అవసరమైనవారికి ఉచితంగా కంటి అద్దాలతోపాటు మందులు కూడా ఇస్తున్నారని తెలిపారు. కంటి శుక్లమున్నవారి కూడా ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ సునీత, గ్రామ పెద్దలు బలరం, మేఘ నాయక్, కమలాజి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో శుక్రవారం ముస్లిం సోదరులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇఫ్తార్ విందులో తహసీల్దార్ విక్రమ్, ఎస్ఐ భాస్కరా చారి, ఆర్ఐ గంగారాం, ఎంపీపీ భర్త బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, జడ్పీటిసి భర్త బద్దం నర్సారెడ్డి, సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, కో అప్షన్ సభ్యులు మునిరొద్దీన్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కంచు విజయ్ పాల్గొని ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ముప్కాల్/కంఠేశ్వర్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

వేంపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రంను సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపో వద్దని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఏ గ్రేడ్ ధర రూ. 2060, బీ గ్రేడ్ ధర రూ. 2040 రూపాయలుగా నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సారెడ్డి, సొసైటీ వైస్ ఛైర్మన్ బద్దం నర్సారెడ్డి, స్థానిక ఉప సర్పంచ్ జక్క గంగాధర్, సొసైటీ డైరెక్టర్లు నేర బాబ్ రావ్, మల్కన్న, సొసైటీ సెక్రటరీ వంశీకృష్ణ, అశోక్, వేంపల్లి రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

కంఠేశ్వర్ : నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త జీజీకాలేజి గ్రౌండ్ లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్ లు, నాయకులు పాల్గొన్నారు.

రోటరీ సేవలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలి

- నిజామాబాద్ సబ్ డివిజన్ ఏసీపీ

ఎం. కిరణ్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్



వడదెబ్బ నివారణపై కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏసీపీ, తదితరులు

రోటరీ క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని నిజామాబాద్ సబ్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం. కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని బర్కత్‌పురనందుగల రోటరీ కార్యాలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ జిల్లా శాఖ ప్రజలకు ఎనలేని సేవలు చేస్తుందని దీనిలో ముఖ్యంగా బర్కత్పుర కార్యాలయం నందు గల డైలీ క్లినిక్, శీతల శివపేటికరణ, తక్కువ రుసుముతో ఫంక్షన్ హాల్, కృత్రిమ జైపూర్ కాలు అందించుట, వైద్యం విద్య తదితర అంశాలలో అనేక రకాలుగా సేవలు చేస్తూ ముందుకు వెళ్తుందని ఇట్టి సేవలను ప్రజలందరూ వినియోగించుకోగలరని కొనియాడారు. మధ్యాహ్నం ఎండనుండి కాస్త ఉపశమనం పొందాలని, అధిక మొత్తంలో నీళ్లను పండ్లను సేవించాలని క్లబ్ అధ్యక్షులు సతీష్ షాహ తెలిపారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుల విశాల్ మాట్లాడుతూ.. ఎండతీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేకుంటే అనారోగ్యం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సభ్యులు వి శ్రీనివాసరావు, దర్శన్ సింగ్ సోకి, జ్ఞాన ప్రకాష్, సుధీర్ గుప్తా,ప్రసన్నకుమారి, ఇందూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కేసీఆర్ ప్రభుత్వ ధ్యేయం

- ఎంపీపీ సంగెం శ్రీనివాస్

నవతెలంగాణ-నవీపేట్



రైతుల సంక్షేమమే కేసీఆర్ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అభంగపట్నం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపిఎం భూమేశ్వర్ గౌడ్, గ్రామ పెద్దలు సంతోష్ రెడ్డి, పులి సాయిలు మరియు ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురికి జీవిత ఖైదు

- అన్నదమ్ముల హత్యకేసులో శిక్ష
- జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత తీర్పు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బద్రి పవన్ కళ్యాణ్ అలియాస్ బబ్లూ, బద్రి నర్సింగ్ యాదవ్ అలియాస్ కన్న అనే అన్నదమ్ములను మూకుమ్మడిగా హత్యచేసిన కేసులో మొగుల్ల సాయి ప్రసాద్ అలియాస్ తల్వార్ సాయి, మొగుల్ల మహేందర్ యాదవ్ అనే అన్నదమ్ములకు వారి స్నేహితుడు దాత్రిక సంజయ్ అలియాస్ నానిలకు జీవిత కారాగార శిక్ష విధిస్తు నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల శుక్రవారం తీర్పు చెప్పారు. ముద్రకొల్ల ప్రేమ్ కుమార్‌పై హత్యాయత్నం చేసినందుకుగాను సాయిప్రసాద్‌కు మరో ఏడేళ్ళ కఠిన జైలుశిక్షను ఖరారు చేశారు. నిజామాబాద్ నగరంలోని హమల్ వాడికి చెందిన సాయి ప్రసాద్, మహేందర్ యాదవ్, సంజయ్‌లకు ఆదర్శ నగర్ వాసులైన పవన్ కళ్యాణ్, నర్సింగ్ యాదవ్‌లకు వ్యక్తిగత కక్షలు ఉన్నాయి. చిన్నపాటి ఘర్షణలో సాయి తన స్నేహితుడైన సంజయ్‌ను పిలిపించుకుని తల్వార్, క్రికెట్ బ్యాట్స్ తీసుకుని నిజామాబాద్ రైల్వేస్టేషన్ గ్రౌండ్‌లోకి వెళ్లి తనతమ్ముడు మహేందర్‌ను పిలిపించుకున్నాడు. ఫోన్‌చేసి పవన్, నర్సింగ్‌ను గ్రౌండ్‌కు వచ్చే విధంగా రెచ్చగొట్టి పిలిపించారు. వారిని చంపివేయాలనే ఉద్దేశంతోనే సాయి తల్వార్‌తో నర్సింగ్‌ను తీవ్రంగా గాయ పరిచాడు. అడ్డుపడిన పవన్‌ను కూడా తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన వారిని మిగతా ఇద్దరు మహేందర్, సంజయ్ క్రికెట్ బ్యాట్లతో తీవ్రంగా కొట్టి 21 జూలై 2018న హత్య చేశారని తెలిపారు. నిజామాబాద్ నగర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్య నారాయణ ముందు నేర విచారణ అధికారులుగా విధులు నిర్వహించిన సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేష్ సేకరించిన సాక్షుల వాంగ్మూలాలు, హత్యలు చేస్తున్న తీరును సెల్ ఫోన్ ద్వారా వీడియో చిత్రీకరిస్తున్న హతుల స్నేహితుడు ప్రేమ్‌కుమార్‌పై తల్వార్, క్రికెట్ బ్యాట్స్‌తో హత్యాయత్నం చేసి గాయపరిచారని పేర్కొంటూ సాక్ష్యాలు దాఖలు చేశారు. నేర న్యాయ విచారణలో భాగంగా పద్నాలుగు మంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసిన సెషన్స్ కోర్టు, పోస్ట్ మార్టం రిపోర్ట్‌తో సహా ఇరవై రెండు ధృవీకరించుకున్న పత్రాలు మార్క్ చేసుకుని, పద్నాలుగు వస్తు సాక్ష్యాలు కూడ మార్క్ చేసి ముగ్గురు ముద్దాయిలు ఇద్దరిని హత్య చేశారని, మరొకరిపై హత్యాయత్నం చేశారని నేరం నిరూపణ అయినట్లు నిర్ధారిస్తు ముగ్గురికి జీవిత కారాగార శిక్ష తో పాటు యాభై వేల రూపాయల జరిమాన విధించారు. జరిమానా చెల్లించని ఎడల అదనంగా ఆరు నెలల సాధారణ జైలుశిక్ష వేయాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రధాన ముద్దాయి అయిన సాయి ప్రసాద్ ప్రేమ్ కుమార్‌పై హత్యాయత్నం నేరం చేశాడని నిరూపణ అయినందున ఏడు సంవత్సరాల కఠిన జైలుశిక్ష తో పాటు పదివేల రూపాయల జరిమాన విధించారు. మిగతా ఇద్దరు ముద్దాయిలపై హత్యాయత్నం కేసు నిరూపణ కాలేదని కోర్టు తీర్పులో రాశారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ఇంటర్నేషనల్ గ్రూప్ ఆఫ్ ఫొటోగ్రఫీలో ఏర్గట్ల వాసికి అరుదైన గౌరవం

నవతెలంగాణ-ఏర్గట్ల



మండలకేంద్రానికి చెందిన పిట్ల రాముకు ఫోటోగ్రఫీలో అరుదైన గౌరవం దక్కింది.చిన్ననాటి నుండి ఫోటోగ్రఫీ అంటే మక్కువతో దానినే ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ఎన్నో మంచి మంచి ఫోటోలు తీస్తూ..ప్రజల చేత ప్రశంశలు అందుకున్నారు. ఇందులో భాగంగానే ఆయన తీసిన ఫొటో ఇంటర్నేషనల్ గ్రూప్ ఆఫ్ ఫోటో గ్రఫీ మ్యాగజిన్‌కు ఎంపిక కావడంతో రాము సంతోషం వ్యక్తంచేశారు. ఫలితంగా వారితో సర్టిఫికెట్ అందుకున్నట్లు తెలిపారు.

హాసకోత్తుర్‌లో రంజాన్ దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



రంజాన్ దుస్తులు అందజేస్తున్న ఉపసర్పంచ్

మండలంలోని హాసకొత్తుర్ గ్రామంలో శుక్రవారం రంజాన్ పండగ సందర్భంగా ముస్లింలకు తెలంగాణ ప్రభుత్వం అందించిన రంజాన్ బట్టలను అందజేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్ రంజాన్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ రంజాన్ పండగను ముస్లిం లంతా సంతోషంగా జరుపుకొని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తెడ్డు కిరీటి, రైతు బంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ నోముల నరేందర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వసంత్ నాయక్, గడ్డం భాస్కర్, మేడపు రమేష్, నర్సయ్య, నాయని పురుషోత్తం, దాశ రాజేశ్వర్, మురళి, ఎస్.కె మస్తాన్, అబ్దుల్ సుభాన్, ఇబ్రహీం, మహ్మద్ రఫీ, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని పవన్ నగర్ 38 డివిజన్ భారతీయ జనతా పార్టీ బూత్ స్థాయి అధ్యక్షులు చిల్కే గణేష్ ప్రమాదవశాత్తు కాలుజారి పడడంతో కాలుఫ్యాక్చర్ అయిందని తెలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. గణేష్ కుటుంబానికి ఏ అవసరం ఉన్న అన్ని విధాల అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గడ్డం రాజు, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, శివునూరి భాస్కర్, శివాజీ, భీమన్న, భాస్కర్ రెడ్డి డివిజన్ వాసులు పాల్గొన్నారు.

పుడమి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

నవతెలంగాణ-సిరికొండ



పుడమిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఏప్రిల్ 22 ప్రపంచ ధరిత్రి దినోత్సవం పురస్కరించుకుని సత్యశోధక్ నేషనల్ గ్రీన్ కోర్ విద్యార్థులు శుక్రవారం సేవ్ ఎర్త్ అనే ఆంగ్ల అక్షరాల రూపంలో కూర్చున్నారు. భూతాపాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రావుట్ల నర్సయ్య పిలుపునిచ్చారు. ప్రకృతి సంపదలు అందరివని వాటిని సవ్యంగా ఉపయోగించడం, మొక్కలను విరివిగా నాటడం, ప్లాస్టిక్ వినియోగాలను సమూలంగా నిర్మూలించడం, పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన తెలిపారు.

బంగారం కొనుగోలు విడదీయలేనిది

- శ్రీరామ్ శ్రీనివాస్- బాలాజీ జ్యువెలర్స్

నవతెలంగాణ-ఆర్మూర్



కోట్లాది మంది భారతీయులకు అక్షయ తృతీయ సంబరాల్లో బంగారం కొనుగోలు విడదీయ లేనిదని పట్టణంలోని బాలాజీ జ్యువెలర్స్ యజమాని శ్రీరామ్ శ్రీనివాస్ అన్నారు. నేడు అక్షయ తృతీయ సందర్భంగా ఈసారి పండగకు తక్కువసైజు కొనుగోలు అధికంగా వస్తున్న అక్షయ తృతీయ ప్రతి ఇంట్లో శుభాలు జరుగుతాయి.

పర్వదినం అక్షయ తృతీయ

- పట్టణ వెండి, బంగారు వర్తక సంఘం మాజీ అధ్యక్షులు మంచిర్యాల కిషన్

నవతెలంగాణ-ఆర్మూర్



జీవితంలో అన్నిటిని అక్షయం చేసే పర్వదినం అక్షయ తృతీయ అని పట్టణ వెండి బంగారు వర్తక సంఘం మాజీ అధ్యక్షులు మంచిర్యాల కిషన్ అన్నారు. నేడు అక్షయ తృతీయ సందర్భంగా నవ తెలంగాణతో మాట్లాడుతూ వైశాఖ మాసంలో శుక్లపక్ష తదియ అనగా అక్షయ తృతీయ నాడు శ్రీ మహాలక్ష్మిని కొలిచే సంప్రదాయం భారతదేశమంతా ఉందని అన్నారు. ఈరోజు బంగారం కొని లక్ష్మీదేవి ముందు ఉంచి పూజిస్తే అది అక్షయ మౌతుందని ఐశ్వర్యాలు అక్షయమవుతాయని విశ్వాసం అని తెలిపారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్‌కు 42 రోజుల శిక్షణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

సంచాలకులు ప్రభుత్వ పరీక్షల విభాగం తెలంగాణ హైదరాబాద్ ఆదేశాల మేరకు టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్స్‌కు మే ఒకటో తేదీ నుండి 11 జూన్ వరకు 42 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు చేయడానికి 20 ఏప్రిల్ 23నకు 18 సంవత్సరాల వయసు నుండి ఉండాలని 45 సంవత్సరాల వయసు దాటకూడదని పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, చేరబోయే కోర్సుల్లో లోయర్ గ్రేడ్ టిసిసి ఉత్తీర్ణులుగా ఉండాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల వారు అడ్మిషన్ పొందాలంటే ముందుగా సంచాలకులు పరీక్షల విభాగం హైదరాబాద్ వారిని అనుమతి పొందాలని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు అడ్మిషన్ కార్డును ఈనెల 20 నుండి bse.telangana.in వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

విద్యార్థులకు రంజాన్ కిట్లు అందజేత

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని కిడ్స్ పార్క్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు రంజాన్ కిట్లను అందజేశారు. అనంతరం కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ... విద్యార్థులు హిందు, ముస్లిం అనే తారతమ్యం లేకుండా రంజాన్ పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సయ్యద్ ఆసిఫ్,షకీల్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు రండి

- మంత్రికి సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-మోర్తాడ్



సమావేశంలో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

బాల్కొండ నియోజకవర్గంతోబాటు జిల్లాలో 50 సంవత్సరాలుగా చేయలేని అభివృద్ధి కేవలం 8 సంవత్సరాల నాలుగింతలు ఎక్కువగా అభివృద్ధి చేశామంటూ జిల్లా మంత్రి భీంగల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడడం తన స్థాయికి సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. నాలుగింతల పనులు చెయ్యకపోతే తన పదవి నుండి తప్పుకుంటానని చెప్పకనే చెప్పినట్లు మాట్లాడాడని తెలిపారు. శుక్రవారం మండలంలోని దొన్‌పాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. 50 ఏండ్ల కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన పనులు బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన పనులపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. మంత్రి స్థలం, ప్రదేశం నిర్ణయించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కమిషన్ల కోసం కక్కుర్తి పడి రోడ్లు, చెక్ డ్యాములు నిర్మించి అభివృద్ధి అంటూ నియోజక వర్గ ప్రజలను మోసం చేయడమే మంత్రి ధ్యేయంగా పెట్టుకున్నారని అన్నారు. అభివృద్ధి అంటే ఉద్యోగ మౌలిక వనరులు కల్పించడం, నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడం, రైతులకు ఇచ్చిన లక్ష రూపాయల రుణమాఫీ అమలు చేయడం, 57 సంవత్సరాలు నిండినవారికి పింఛన్ ఇవ్వడం అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రోడ్లపై పైపై నిర్మాణాలు చేసి అభివృద్ధి అంటూ ప్రచారం చేయడం అభివృద్ధి అవుతుందా అని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ ప్రతి సంవత్సరం డీఎస్సీ వేసిందని తెలిపారు. వేలాది ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. తన సొంత మండలంలోని ఏర్పాటు చేసిన పసుపు సౌలభ్య కేంద్రం ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేయకపోతే తామే సొంతంగా 40 కోట్ల రూపాయలతో పసుపు బోర్డు ఏర్పాటు చేసుకుంటామని సీఎం చెప్పిన మాట నీటి మూటలు గానే ఉందన్నారు. మంత్రి చేపట్టిన పనులపై బహిరంగ చర్చకు స్థల వేదిక ఏర్పాటు చేసి రావాలని అన్నారు. స్వయంగా మంత్రి తేదీ వేదిక ప్రకటించాలని, కిందిస్థాయి వారితో సమాధానాలు ఇప్పించడం కాదని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి, నాయకులు రవి, రొక్క మురళి, ఎన్ ఎస్ సి ఐ జిల్లా అధ్యక్షుడు వేణు, మహిపాల్, అశోక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సర్పంచ్‌ను కలిసిన సామాజిక తనిఖీ బృందం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం సభ్యులు సర్పంచ్ సక్కారం అశోక్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. పంచాయతీ పాలకవర్గం సభ్యులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అధ్యక్షతన గ్రామంలో 2022-23 లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు వచ్చిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనుల్లో ఎటువంటి అవకతవకలు లేకుండా సామాజిక తనిఖీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, డిఆర్ పి పవన్ సాయి, వార్డు సభ్యులు నాయకులు నెల్ల రమేష్, సక్కారం నారాయణ, అశోక్, ఆర్.పి రాజు, వీఎస్ ఏలు, తదితరులు పాల్గొన్నారు.

వాటరింగ్ డేలో పాల్గొన్న ఎంపీడీఓ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్
మండల కేంద్రంలో ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వాటరింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలకు నీరుపోశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం కార్యాలయంలో నాటిన మొక్కలకు నీళ్ల పోయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాణి, ఎంపీఓ సూర్యకాంత్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


మొక్కలకు నీరు పడుతున్న ఎంపీడీవో

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-మద్నూర్
మండలంలోని మదన్‌హిప్పర్గ గ్రామంలో ఆ గ్రామ సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సంఘ అధ్యక్షురాలు అర్చన, సర్పంచ్ రాజకుమార్ పటేల్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పలువురు

కనీసవేతనం అమలు చేయాలి

- ఏపీఎంకు వినతిపత్రాన్ని అందజేసిన వీవోఏలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్
తమకు కనీసవేతనం అమలు చేయాలని వీవోఏలు ఏపీఎంకు రవీందర్‌కు మండల కేంద్రంలో శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామ సమైక్యలో పనిచేస్తున్న ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయాలని కోరారు. సెర్ప్ ఉద్యోగుల తరహాలో రెగులైజ్ చేసి బీమా సౌకర్యం కల్పించాలని అదే విధంగా ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం నేరుగా తమ ఖాతాలో జమ చేయాలని కోరారు. జాబ్‌కార్డ్‌కు సంబంధంలేని ఆన్ ఎస్కల్ పనులతో సహా ఇతర పనులను చేయించవద్దని కోరారు. కార్యక్రమంలో వీవోఏ మండల ఉపాధ్యక్షులు నిర్మల, కార్యదర్శి రఘుపతి, సహాయ కార్యదర్శి సంతోష్, కోశాధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి చేసిన ఆరోపణలు అవాస్తవం

నవతెలంగాణ-బోధన్
బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలో గురువారం పర్యటించి పనులు పరిశీలించిన మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణల్లో నిజం లేదని బీఆర్ఎస్ మండల కార్యదర్శి సుదర్శన్ అన్నారు. శుక్రవారం అమ్దాపూర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్దాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మన ఊరు-మన బడి కింద పనులు మంజూరు అయిన సందర్భంగా ఎవరు పనులు చేయడానికి ముందుకు రాక పోవడంతో స్వయంగా తానే ఆ పనులను చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేసినట్లు తెలిపారు. చేసిన పనులకు మాత్రమే బిల్లులు తీసుకున్నామని, అధికారులు తాను చేసిన పనులను తనిఖీలు చేయవచ్చని, నాసిరకం పనులుంటే తనపై ఎలాంటి చర్యలనైనా తీసుకోవాలన్నారు. త్వరలో డబుల్ బెడ్ రూంలు పూర్తి అయినందున ఎమ్మెల్యే చేతుల మీదుగా నిరుపేదలకు అందచేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

ఇండ్ల మంజూరు కోసం అర్హులను గుర్తిస్తాం

- తహసీల్దార్ హామీతో బీజేపీ రిలే నిరాహార దీక్ష విరమణ

నవతెలంగాణ-మద్నూర్
మద్నూర్ మండలంలో గల అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా కొనసాగిస్తున్న రిలే నిరాహార దీక్షతో తహసీల్దార్ అనిల్ కుమార్ స్పందించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు కోసం అర్హులను గుర్తిస్తామని, ఇండ్ల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు. దీంతో నిమ్మరసం తాగి నాయకులు ఆందోళనలను విరమించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు బి.హనుమాన్లు మాట్లాడుతూ.. తహసీల్దార్ ఇచ్చిన హామీ మేరకు దీక్ష విరమిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు కాకపోతే ఇక రిలే నిరాహార దీక్షలు ఉండవని, ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు చాట్ల హనుమాన్లు, వెంకట్ కాలే, తెప్ప తుకారం తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా కాంపౌండ్ వాల్‌కు శంకుస్థాపన

నవతెలంగాణ-బోధన్
సాలూర మండల కేంద్రంలోని ఈద్గాకు కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం ఎంపీపీ బుద్దె సావిత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ఎస్.డి.ఎఫ్ నిధుల కింద 5లక్షలు నిధులు మంజూరు చేయడంతో కాంపౌండ్ వాల్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నిధులు మంజూరి చేసిన ఎమ్మెల్యేకు ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సాలూర షకీల్, సర్పంచ్ చంద్రకల, సహకార సంఘం చైర్మన్ అల్లె జనార్ధన్, గ్రామ పెద్దలు బి.వెంకట్ పటేల్, బుయ్యన్, సురేష్, కండెల సంజీవ్, కేజీ గంగారాం, మజీద్ కమిటీ పెద్దలు యూసఫ్, ఎస్‌కే జాఫర్, రహిమోద్దీన్, వార్డు సభ్యులు నబి, ఎస్.మౌలానా, సయ్యద్. ఖాదర్, మౌలానా, నబి, మొహిద్దీన్, అక్బర్, సయ్యద్, ఆమిర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పెరటి కోళ్ల పంపిణీ


కోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

నవతెలంగాణ-లింగంపేట్
మండల కేంద్రంలోని పశువైద్య కార్యాలయంలో సబ్సిడీ పెరటి కోళ్లను ఎంపీపీ గరీబ్ నిషా నయీమ్, సర్పంచ్ బొల్లు లావణ్య చేతుల మీదుగా లబ్దిదారులకు శుక్రవారం అందజేసినట్టు మండల పశువైద్యాధికారి రవికుమార్ తెలిపారు. లింగంపేట్ మండలానికి సబ్సిడీపై పెరటి కోళ్ల యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. లింగంపేట్‌కు 6, కోమటిపల్లికి 1 మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. నాలుగు నెలల పాటు కోళ్లను పెంచితే అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫతియోద్దీన్, వెటర్నరీ అసిస్టెంట్ రవి, పశు వైద్య సిబ్బంది రమేష్, ఎజాజ్, శివలాల్ లబ్దిదారులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో మహా అన్నదానం

నవతెలంగాణ-జుక్కల్
మండలంలోని బస్వాపూర్ బసవన్న మందిరంలో శనివారం నిర్వహించే అక్షయ తృతీయను పురస్కరించుకొని గ్రామస్తులు, భక్తుల ఆధ్వర్యంలో మహా అన్నదానం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవిపటేల్ మాట్లాడుతూ.. శనివారం నిర్వహించే బసవ జయంతి రోజు నాలుగు వేల మంది భక్తుల పాల్గొంటారని, అగ్నిగుండం, జయంతి వేడుకలు, ఊరేగింపు, బసవ జెండావిష్కరణ చేయనున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే హన్మంత్ షిండే, స్థానిక నాయకులు విండోచైర్మెన్ శివానంద, నీలుపటేల్, జడ్పీటీసీ, మాజీ మార్కెట్ చైర్మెన్ సాయాగౌడ్, బొల్లిగంగాధర్, మాదారావ్ దేశాయి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.


అన్నదానంలో పాల్గొన్న గ్రామస్తులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఆర్డీఓ రాజేశ్వర్
- విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

నవతెలంగాణ-బోధన్
ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కావున విద్యార్థుల తల్లిదండ్రులు తమ విద్యార్థులను ప్రైవేటులో కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను పంపాలని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మావందిఖుర్దు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గోల్డెన్ జూబ్లీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఐకమత్యంతో కలిసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించడం చాలా అభినందనీయమని



మాట్లాడుతున్న ఆర్డీవో

ఉపాధ్యాయులకు, గ్రామస్థులకు ఆయన అభినందించారు. ప్రభుత్వం గుణాత్మకమైన విద్యను అందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా మన ఊరు మనబడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని దాని ద్వారా పాఠశాలలను ఆధునీకరించి సకల సౌకర్యాలు కల్పించి ప్రైవేటు పాఠశాలలు ధీటుగా తయారు చేస్తున్నారని అన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుంది కనుక గ్రామంలోని ప్రతి విద్యార్థిని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలకు పంపాలని సూచించారు. గతంలో కంటే నేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఫలితాలు మెరుగ్గా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నందున సకల సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ ప్రతి గ్రామానికి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తుందని వివరించారు. ప్రతి ఉపాధ్యాయులు ముందుగా విద్యార్థులకు బేసిక్స్ నేర్పిస్తే పై తరగతిలో విద్యార్థి ఇబ్బంది పడకుండా ఉండడానికి అవకాశం ఉంటుందని అన్నారు. గొప్ప వ్యక్తులుగా తయారైన మేధావులు ఎందరో ప్రభుత్వ పాఠశాల నుంచి చదువుకుని వచ్చిన వారేనని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో తోట పర్వన్న, ఎంపీపీ బుద్దె సావిత్రి, ఎంఈఓ నాగనాథ్, వైస్ ఎంపీపీ కోటగంగారెడ్డి, సర్పంచ్ పోషవ్వ, మార్కెట్ కమిటీ చైర్మన్ వీఆర్ దేశాయ్, డీసీసీ డైరెక్టర్లు గంగారెడ్డి, శరత్, విద్యా కమిటీ చైర్మన్ శిరీష, హెచ్ఎం స్వర్ణకుమారి, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు శంకర్, గ్రామ పెద్దలు సింగారి సాయిలు, శివకుమార్, రాజు, పెద్ద మావంది సర్పంచ్ లస్మయ్య, బీఆర్ఎస్ నాయకులు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి కంటి చూపు అందించడమే లక్ష్యం

- ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్

నవతెలంగాణ-ఎడపల్లి/పెద్దకొడప్‌గల్
ప్రతి ఒక్కరికి కంటి చూపు అందించడమే లక్ష్యమని ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దుబ్బతండా గ్రామపంచాయతీలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడారు. దుబ్బ తండ గ్రామస్తులు కంటి వెలుగు శిబిరాన్ని చేరుకొని కంటి పరీక్షలను నిర్వహించుకోవాలని ఆయన కోరారు. అవసరం ఉన్నవారికి కంటి అద్దాలు పంపిణీ అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కంటి వెలుగు ఇన్చార్జి వైద్యాధికారి రాజ్ కుమార్, కంటి వెలుగు వైద్యులు ప్రశాంత్ శ్రీకాంత్, డీఈఓ భారతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.


పెద్దకొడప్‌గల్ : కంటి వెలుగు ప్రారంభిస్తున్న దృశ్యం

కంటి వెలుగును ప్రారంభించిన సర్పంచులు..
పెద్దకొడప్‌గల్ : మండలంలోని కాస్లబాద్ గ్రామంలో సర్పంచ్ చేతుల మీదుగా రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు.
అనంతరం సర్పంచులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలు అంధత్వం నుంచి దూరం కావడం కోసం కంటి వెలుగు కార్యకమం చేపట్టారని తెలిపారు. కార్యక్ర మంలో ఎంపీడీఓ రాణి, ఎంపీఓ సూర్యకాంత్, సర్పం చ్‌లు గణపతి రావు, శోభ, బుసాప్ప పటేల్, డా.శేసికాంత్, ఉమాదేవి, వైద్య బృందం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



చీరలు, తినుబండారాలు పంపిణీ చేస్తున్న పాషా

నవతెలంగాణ-బిచ్కుంద
సమాజంలో కోటీశ్వరులు.. మధ్యతరగతి ప్రజలు.. అట్టడుగున జీవిస్తున్న నిరుపేదలు.. ఎవరి స్థాయిలో వాళ్ళు సంతోషంతో, కొందరు అష్టకష్టాలు పడుతూ జీవిస్తున్నారు. కానీ కష్టాల్లో సైతం సంతోషాన్ని వెతుక్కుంటున్న వారు మరికొందరు ఉన్నారు. అదే కోవలోకి వస్తాడు మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాషా సేట్. ఈ సమాజంలో పేద కుటుంబానికి చెందిన వారు కూడా రంజాన్ పండగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో తాను సంపాదించిన దాంట్లో పేదవారికి సహాయ సహకారాలు అందిస్తున్నాడు. గత 20 సంవత్సరాల నుంచి పేదవారికి దుస్తులు, తినుబండారాలు ఉచి తంగా పంపిణీ చేస్తూ.. ఆదర్శ ంగా నిలుస్తున్నాడు.
అందులో భాగంగానే శుక్రవారం మండల కేంద్రంలోని 14 వార్డులో 200 మంది పేద మహిళలకు చీరలు, తినుబండారాలు పంపిణీ చేశారు. అనంతరం సీనియర్ నాయకులు పాషా సెట్ మాట్లాడుతూ.. రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని, చీరలు, తినుబండారాలు ఉచితంగా పంపిణీ చేసినట్టు తెలిపారు. సమాజంలో పండుగలను పేద, ధనిక అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరూ సమానత్వంతో పండగలు జరుపుకోవాలనే ఉద్దేశంతో చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. ముస్ముందు ఇంకా ఎన్నో సమాజసేవ కార్యక్రమాలు చేపట్టి పేద ప్రజల కోసం చేపట్టే కార్యక్రమాల కోసం తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా అన్నారు. ఉస్మాన్ సేట్, మాజీ కోఆ ప్షన్ సభ్యులు బాబా, వార్డ్ మెంబర్ కరీం జాఫర్, దన్ సింగ్, హైమద్, కలీం, మహిళలు ఉన్నారు.

రంజాన్ కానుకగా నగదు పంపిణీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని 5 మజీద్‌లలో రూ.20 వేల చొప్పున లక్ష రూపాయలను రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పవిత్ర మాసమైన రంజాన్ పండుగను పురస్కరించుకుని మైనార్టీ సోదరులకు కానుకగా నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల మేరకు ఆయన పర్సనల్ పీఏ చక్రవర్తి ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని పలు మసీదులలో చిరుకానుకను అందజేశారు. ఈ


నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే పీఏ

సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, మైనార్టీ నాయకులు ఇమ్రాన్, ముజీబుద్దిన్ షరీఫ్ బాయ్, కౌన్సిలర్ ఎరుకల సాయిలు, తిరుపతి, పోచయ్య, డాక్టర్ సాయిలు, లింగం, సొసైటీ చైర్మన్ వేగుల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తాడ్వాయి
అప్పుల బాధతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జోగు నర్సింలు (36) గత కొన్ని రోజులుగా తాగుడుకు బానిసై, తాగుడు కోసమే అప్పులు చేశాడు. భార్య వినోద బంగారు వస్తువులు, పట్టగొలుసులు కూడా తాకట్టు పెట్టి తాగడంతో తీవ్ర అప్పులపాలయ్యాడు. అప్పుల బాధ భరించలేక


మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఈనెల 18న తన ఇంట్లో లిక్కర్‌లో పురుగుల మందు కలిపి తాగాడు. వెంటనే గమనించిన అతని భార్య వినోద కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స తర్వాత నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం 1:30 గంటలకు చనిపోయాడు. మృతుని భార్య వినోద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-తాడ్వాయి
కామారెడ్డి బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు నాయమూర్తులు జస్టిస్ నవీన్ రావ్, జస్టిస్ విజయసెనారెడ్డి, జస్టిస్ శ్రీ సుధను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచం అందజేశారు. అనంతరం వారి సమస్యలను గురించి వివరించారు. కామారెడ్డి కోర్టుకు జూనియర్ సివిల్ జడ్జిని కేటాయించాలని, అదనపు కోర్టును మంజూరు చేయాలని న్యాయమూర్తులను కోరారు. వారిని కలిసిన వారిలో అసోసియేన్ అధ్యక్షుడు అతిమాముల శ్రీధర్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బండారి సురేందర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు జగన్నాథం, వెంకట్రాంరెడ్డి ఉన్నారు.


హైకోర్టు న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్‌అసోసియేషన్ సభ్యులు

నీట మునిగి ఒకరు మృతి

నవతెలంగాణ-బిచ్కుంద
బిచ్కుంద మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన లొంగడం శంకర్ (46) శుక్రవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఊర చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో జారి పడిపోగా అతనికి ఈత రాకపోవడంతో మునిగి చనిపోయినట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు. లొంగడం శంకర్ భార్య వీణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మినీ వాటర్ ట్యాంక్ ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్
మండలంలోని కొయ్యగుండు తండా, ఎల్లమ్మతండా గ్రామాల్లో రిలయన్స్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మినీవాటర్ ట్యాంకును ఇన్చార్జి సర్పంచ్ భీమ్ రావు, ఎంపీపీ గరీబున్నిసా నయీం, తహసీల్దార్ రాజేశ్వర్ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించినట్టు ఫౌండేషన్ పులగం రాజు తెలిపారు. తండాలో ప్రజల దప్పిక తీర్చేందుకు రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించినట్టు వివరించారు. గ్రామాల్లో రిలయన్స్ ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాల గురించి రిలయన్స్ ఫౌండేషన్ పులగం రాజు వివరించారు. కార్యక్రమంలో కొయ్యగుండు తండా సర్పంచ్ లలితరాందాస్, ఎల్లమ్మ తండా సర్పంచ్ భీంరావు, ఎంపీటీసీ బాగవ్వ సాయిలు, లింగంపల్లి సర్పంచ్ రాజయ్య, ముస్తపూర్ సర్పంచ్ మమత వివేకానంద, ఎల్లారం సర్పంచ్ లక్ష్మి మల్లయ్య, మోతె సర్పంచ్ రాంరెడ్డి, రిలయన్స్ ఫౌండేషన్ డీపీఓ ఉరేషన్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు స్వామి, రాజు, ఐసీడీఎస్ సూపర్వైజర్, స్వరూప రాణి, గ్రామ వార్డుమెంబర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా అందజేత


లింగంపేట్ : రంజాన్ తోఫాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

నవతెలంగాణ-లింగంపేట్/రెంజల్
మండల కేంద్రంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల అనుసారం ఎంపీపీ గరీబున్నీసా నయీమ్, సర్పంచ్ లావణ్య చేతుల మీదుగా ముస్లింలకు రంజాన్ తోఫాను శుక్రవారం అందజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నీ మతాలకు ప్రాధాన్యతనిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫతీయొద్దీన్, బీఆర్ఎస్ లింగంపేట్ యూత్ పట్టణ శాఖ అధ్యక్షులు షేక్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫాలను అందజేసిన సర్పంచ్..
రెంజల్ : మండల కేంద్రమైన రెంజల్ రైతు వేదికలో సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, జిల్లా సీనియర్ నాయకులు రఫిక్‌లు నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందజేసిన తోఫాలను నిరుపేదలను గుర్తించి వారికి అందజేసినట్టు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు టి.అంజయ్య, షబ్బీర్, అనిల్, ప్రభాకర్, అన్సార్, సిరాజుద్దీన్, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

గోనె రెడ్డి సంఘం భవనం నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల కోటగల్లీలో 25 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న గోనె రెడ్డి సంఘం భవనం నిర్మాణానికి భూమి పూజ చేసి పనులని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ సిరిగాద ధర్మపురి, కో ఆప్షన్ మెంబర్ అంతరెడ్డి లత దేవి,చింతకాయల రాజు గొనె రెడ్డి సంఘం సభ్యులు ఉప్పులపు సంతోష్ రెడ్డి, ఎల్సాని గంగ రెడ్డి, హరీష్ రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ..
నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త నిజామాబాద్ పట్టణ రియల్ ఎస్టేట్ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజచేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ..నిజామాబాద్ నగరం అన్ని రకాలుగా అభివద్ధి చెందిందని అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల సహకారంతో సామాన్య ప్రజలు సొంతింటి కలను నెరవేర్చుకుంటున్నారని తెలిపారు. రియల్ ఎస్టేట్ సంఘ సభ్యులకి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ ఉమారాణి శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో ఇఫ్తార్



నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని బలహీన వర్గాల కాలనీలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బోధన్ నియోజకవర్గ అధ్యక్షులు సింగడి పాండు మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందును శుక్రవారం ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులు పవిత్ర మాసమైన రంజాన్ మాసంలో ఎంతో నిష్టగా ఉపవాస దీక్షలు చేపట్టారని అన్నారు. వారి ఉపవాస దీక్షలు విరమణకు ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు సింగడి పాండు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అఫ్రోజ్, నబ్బు, జాఫర్, ఆయాజ్, యూసుఫ్ కాలనీ వాసులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అంబేద్కర్‌నగర్‌లో కవ్వాలి



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని అంబేద్కర్‌నగర్‌లో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని గురువారం రాత్రి 9 గంటల నుంచి శుక్రవారం ఉదయం 11 గంటల వరకు కవ్వాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూణే నుంచి రాజరతన్ బృందం, లాతూర్ నుంచి దమ్మి అక్షిత కాంబ్లే బృందం హాజరై కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని ఈ కవ్వాలి నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మధుర భాయ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గోపాల్, వసంత్ కామ్లే, ఉద్దాస్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం ఆ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ త్వరితగతిన పనులను చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. దేవునిపల్లి శివారులో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ ఆస్పత్రి భవన నిర్మాణం పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మెడికల్ కళాశాల విద్యార్థుల వసతి గృహాల ఏర్పాటు కోసం రెండు అద్దె భవనాలను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

బసవ జయంతి వేడుకలకు అన్ని వర్గాల ప్రతినిధులను ఆహ్వానించాలి..

బసవ జయంతి వేడుకలకు అన్ని వర్గాల ప్రతినిధులను ఆహ్వానించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బసవ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, బహుజన సంఘాల ప్రతినిధులతో బసవ జయంతి వేడుకల నిర్వహణపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ నెల 23న కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బసవ జయంతి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, అధికారులు, వీరశైవ జంగం సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

జాకోరాలో కుస్తీపోటీలు



తలపడుతున్న మల్లయోధులు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోరా గ్రామంలో శుక్రవారం కుస్తీ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన మల్లయోధులకు సర్పంచ్, గ్రామపెద్దల సమక్షంలో బహుమతులను నగదు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోదావరి గణేష్, ఎంపీటీసీ సాయిలు, మండలాధ్యక్షుడు గిరి, జాకోరా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సాయిలు, రామమందిర్ కమిటీ చైర్మన్ కెంపుల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బలగం సినిమా ప్రదర్శన

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని కాటేపల్లి గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు శివ పటేల్ ఆధ్వర్యంలో బలగం సినిమాను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ విట్టల్, ఉపసర్పంచ్ జానీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్ దేశాయ్, వైస్ ఎంపీపీ లక్ష్మి సాయిలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-జుక్కల్

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జుక్కల్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అంబేడ్కర్ జయంతి వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు శుక్రవారం వ్యాస రచన పోటీలు నిర్వహించినట్టు ఐసీఎంఆర్ చైర్మెన్ డొంగ్లే ఉమాకాంత్ తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దస్తీరాం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని రైతు వేదికలో బీఆర్‌యస్ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ నెల 25న ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

ముదిరాజ్‌లను ప్రభుత్వం ఆదుకోవాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పున్న రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పున్న లక్ష్మన్, ప్రధాన కార్యదర్శి బోయిని సత్యం, కోశాధికారి కమిండ్ల నర్సింలు, డైరెక్టర్‌లు పున్న రాములు, గరిగే సురేష్, శ్రీనివాస్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తి త్రివేణి సంగమంలో భక్తుల సందడి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. గోదావరి నదిలో రాతి శివాలయంతో పాటు ఇతర ఆలయాలను దర్శించుకున్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-మద్నూర్

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గైక్వాడ్ రాజా బాయి విలాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దటాక్లి గ్రామంలో కంటి వెలుగు పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్, పంచాయతీ పాలకవర్గం సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

25న ఉద్యోగ మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 25న ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ శుక్రవారం కొ ప్రకటనలో తెలిపారు. ఐటిసి లిమిటెడ్ (ఐటీసీ లిమిటెడ్) హెూదా (ట్రైనీ ఆపరేటర్) మనోహరాబాద్ ప్రాంతంలో ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. (అవకాశాలు:100) విద్యార్హత ఐటిఐ ఒకేషనల్ కోర్స్, స్కిల్ ట్రైనింగ్ ఆ పైన చదివిన అభ్యర్థుల వయోపరిమితి 30సం'ల లోపు ఉండాని తెలిపారు. నిరుద్యోగ యువతులకు (కేవలం మహిళలకు) ఉద్యోగమేళాలో జిల్లా ఉపాధి కార్యాలయం నిజామాబాద్ జిల్లాలో పాల్గొనాలని తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం నిజామాబాద్ శివాజీ నగర్ (ఐటిఐ క్యాంపస్) హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 6305743423, 9581768413, 9959456793, సంప్రదించాలని అభ్యర్థులు బయోడేటా ఆధార్ కార్డు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు వెంట తీసుకొని రావాలన్నారు.

నిరుపేదల ఇండ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

నవతెలంగాణ-రెంజల్

రాష్ట్రంలో ఇండ్లు లేని నిరుపేద బీడీ కార్మికులకు రెండు పడకల గదుల ఇవ్వాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా డిమాండ్ చేసింది. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోధన్ డివిజన్ సీపీఐఎంఎల్ ప్రజాపంథా కార్యదర్శి డి.రాజేశ్వర్ మాట్లాడుతూ.. నిరుపేద బీడీ కార్మికులందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్లు ఇవ్వాలని, సొంత ఇంటి స్థలం కలిగిన నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వము మరో ఐదు లక్షలు ఇచ్చి వారిని ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నరేందర్, పుట్టి నడిపి నాగన్న, పార్వతి రాజేశ్వర్, నసీర్, ఓ డ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ లైటింగ్ ఏర్పాటుకు భూమిపూజ

నవతెలంగాణ-బోధన్

మండలంలోని ప్రతి గ్రామంలో హైమాస్ లైట్లను ఏర్పాటు చేయడానికి భూమిపూజ చేసినట్లు డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నమావంది, పెద్దమావంది గ్రామాల్లో ఆయన హైమాస్ లైట్ల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ సహకారంతో బోధన్ మండలంలోని పెద్దమావంది గ్రామంలో హైమాస్ట్ లైట్ కొరకు జడ్పీటీసీ లక్ష్మీ నిధుల నుంచి రూ.1.30 లక్షలు కేటాయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్లు శరత్ కుమార్, ఎంపీపీ బుద్దె సావిత్రి, వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, పెద్దమావంది సర్పంచ్ సూర్య లక్ష్మయ్య, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు గణేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాల పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రాంతీయ కమిటీ ఎన్నికలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మైత్రి గార్డెన్లో శుక్రవారం ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రాంతీయ కమిటీ ఎన్నికలు నిర్వహించారు .ప్రెసిడెంట్‌గా శ్రావణ్, సెక్రటరీగా వెంకట్రావు, ట్రెజరర్‌గా ఎంఏ అజీమ్, సభ్యులుగా శ్రీనివాస్, గంగారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మైత్రి గార్డెన్ యజమాని బంటు మహిపాల్ ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిన్నాపూర్, వేణుకిసాన్ నగర్ తండా, గంగరమంద గ్రామాలలో ఐడిసిఎంఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పి చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి పద్మ, సర్పంచులు లక్ష్మి, రమేష్ నాయక్, గంగాధర్, ఎంపీటిసి సత్యనారాయణ, ఉప సర్పంచ్ యాకుబ్, బారాస నాయకులు పాల్గొన్నారు.

గోసంగి కులస్తులను గుర్తించండి

నవతెలంగాణ-సిరికొండ

గోసంగి కులస్తులను గుర్తించి న్యాయం చేయాలని కోరుతూ గోసంగి సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ను శుక్రవారం కలిశారు. ఈసందర్భంగా గోసంగి సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెల సాయి చరణ్ మాట్లాడుతూ.... గోసంగి కులంకాని వ్యక్తులు బెడ, బుడగ జంగం కులస్తులు, గోసంగి సర్టిఫికెట్ తీసుకుని తమ హక్కులని కాలరాస్తున్నారని అన్నారు. అన్ని మండలాలలో డీఎల్ ఎస్సి కమిటీ వేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షుడు సురేష్, కోశాధికారి ధర్మపురి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయన్న, కార్యదర్శిలు, సలహాదారులు శంకర్, ప్రవీణ్, రాఘవులు, సధానంద్, రాజు, బాలు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద గోసంగి నాయకులు

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలి

- **సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి**

నవతెలంగాణ-లింగంపేట్/రాజంపేట్

రైతులు తమ ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ కూచంపల్లి దేవేందర్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మెంగారం గ్రామ సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అదేవిధంగా శెట్టిపల్లి సంగారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో చైర్మన్ సుకన్య అశోక్‌రెడ్డి చేతుల మీదుగా శెట్టిపల్లి సంగారెడ్డి, లొంకలపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో శెట్టిపల్లి సంగారెడ్డి సర్పంచ్ అనిల్ కుమార్, సీఈఓలు సందీప్, శ్రీనివాస్, ఎంపీటీసీలు కిరణ్, గన్నునాయక్, లింగంపేట్ సింగిల్ విండో వైస్ చైర్మన్ రాములు, రైతులు సంగమేశ్వర్, బాలాగౌడ్ రైతులు పాల్గొన్నారు.

రాజంపేట్ : మండలంలోని పొందుర్తి గ్రామంలో రైతు బంధు కమిటీ మండల చైర్మన్ జూకంటి మోహన్‌రెడ్డి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జంగంపల్లి సింగిల్ విండో చైర్మన్ గోండ్ల సిద్ధిరాములు, సర్పంచ్ పని గంగాకిషన్, ఎంపీటీసీ బాలరాజు గౌడ్, ఏడీఏ అపర్ణ, గ్రామ రైతుబంధు చైర్మన్ భాస్కర్, సింగల్ విండో డైరెక్టర్లు విట్టల్, శివకుమార్, ప్రభాకర్ రావు, గురువారెడ్డి, ఏఈఓ మనీషా, శ్రీకాంత్ గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట్ : కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రభుత్వ పాఠశాలలకు దశదిశ మార్చిన కేసీఆర్ ప్రభుత్వం

- **ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి**

నవతెలంగాణ-ధర్పల్లి

మునుపెన్నడు ఏప్రభుత్వాలు చేయని అభివృద్ధి నేడు రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడం హర్షించదగ్గ విషయమని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అన్నారు. ధర్పల్లి, దుబ్బాక గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలకు సైన్స్ పరికరాలను శుక్రవారం ఆమె అందించారు. ఒక్కొక్క పాఠశాలకు 2 లక్షల ఎంపీపీ నిధులతో 120 రకాల సైన్స్ పరికరాల కిట్లును అందించారు. పాఠాలను పరికరాలతో బోధించినట్లయితే విద్యార్థులకు సునాయాసంగా అర్థమవుతుందని ఈపరికరాలను అందించామని అన్నారు. ఆమె వెంట ధర్పల్లి దుబ్బాక సర్పంచులు ఆర్మూర్ పెద్ద బాలరాజ్, వెంకటేష్, ఉపసర్పంచ్ ప్రతాప్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, గంగాధర్, కోతి శేఖర్ రెడ్డి, పోత రాజు, గ్రామాభివృద్ధి అధ్యక్షులు నూకల రమేష్, రంజిత్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



సైన్స్ పరికరాలను అందజేస్తున్న ఎంపీపీ

అన్ని మతాల వారిని సమానంగా చూస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

- **రంజాన్ ఏర్పాట్లను పరిశీలించిన ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి**

నవతెలంగాణ-ఆర్మూర్

అన్ని మతాల వారిని బీఆర్ఎస్ ప్రభుత్వం సమానంగా చూస్తుందని నియోజకవర్గ ఇన్చార్జ్ ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంకాపూర్ వెళ్లే దారిలో గల మసీదులో శనివారం నిర్వహించే రంజాన్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ముస్లింల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని ,ఐకమత్యంగా ఉంటూ ప్రగతి సాధించాలని అన్నారు. ముస్లిం సోదరులందరికీ రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. మర్కజ్ కమిటీ అధ్యక్షులు ఎం.డి. మొహినుద్దీన్ మాట్లాడుతూ.. ఈద్ అనేది అల్లాహ్ తరపున బహుమతులు అందుకునే రోజని అన్నారు. పరిపూర్ణ విశ్వాసంతో ఉపవాసాలు పాటించిన వారికి ఈ పండగ ఒక గొప్ప కానుక అని తెలిపారు. ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటామని అన్నారు. పట్టణంతోపాటు పెర్కిట్, మామిడిపల్లి తదితర చోట్ల రంజాన్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్, డీఈ భూమేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు పండిత్ పవన్, కౌన్సిలర్లు ఇంతియాజ్ హుస్సేన్, గంగా మోహన్ చక్రు, మర్కజ్ కమిటీ నాయకులు అబ్దుల్ ముక్తార్, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వాలు హామీలు నెరవేర్చాలి

ఉభయ జిల్లాల రైతు అధ్యక్షులు బుల్లెట్ రాంరెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఉభయ జిల్లాల రైతు అధ్యక్షులు బుల్లెట్ రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రెంజర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పసుపు బోర్డు తెస్తానని జిల్లా ఎంపీ ధర్మపురి అరవింద్ మోసం చేశారని అన్నారు. మోర్తాడ్ సభలో సైతం సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళ సంఘాలతో పసుపు ప్యాకెట్లు తయారు చేసి మార్కెట్ కు అనువుగా చేస్తూ పసుపు అమ్మే విధంగా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇప్పటివరకు పసుపుపై ఎలాంటి అదేశాలు లేవని, రైతులను నమ్మబలికి మోసం చేయడం సరైంది కాదని అన్నారు. మరోవైపు రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయలేదని తెలిపారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని, అలాగే పసుపుపై ఒక స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు దర్శకుల లింగన్న, మెంచ్ నర్సయ్య, కుమ్మరి భుమేశ్ తదితరులు పాల్గొన్నారు..

వరద కాలువలో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-మోర్తాడ్

గ్రామ శివారులోని వరద కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ముత్యంరాజ్ శుక్రవారం తెలిపారు. అటువైపుగా వెళ్తున్న రైతులు వరద కాలువలో మృత దేహం ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పూర్తిగా చేపలు తినడంతో ఆనవాళ్లు గుర్తించకుండా ఉందని, ఎవరైనా కనిపించకుండా పోతే తక్షణమే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తలించారు. సమాచారం తెలిస్తే 8712659867కు సమాచారం అందివ్వాలని ఎస్ఐ ముత్యంరాజ్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-మద్నూర్

ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని మండల వీవోఏలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహి ంచారు. దీర్ఘకాలికంగా పరిష్కా రానికి నోచుకోని డిమాండ్లన్నీ వెంటనే పరిష్కరించాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల గ్రామనికి చెందిన తడపాకల్ నర్సాగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయాన్ని తెలుసుకున్న ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని వ్యక్త పరిచారు. ఆయన వెంట సునీల్ సేన సభ్యులు ఉన్నారు.

శకుంతల దేవి వర్ధంతి

నవతెలంగాణ-సిరికొండ

మానవ కంప్యూటర్, క్షణంలో తార్కిక, క్లిష్ట, కఠిన సమస్యలను చెప్పే మేధస్సు, విభిన్న గణిత పజిల్స్, వినూత్న గణిత శాస్త్ర సూత్రాలు ఆవిష్కరించి దేశ విదేశాలలో భారతదేశ ఖ్యాతిని చాటి మానవ కంప్యూటర్ గా పేరెందిన శకుంతల దేవి, 10వ వర్ధంతిని శుక్రవారం సత్యశోధక్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా శకుంతల దేవి చిత్రపటానికి సత్యశోదక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రావుట్ల నర్సయ్య పూలమాలవేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు అబాకస్, వేదిక్ గణితంలో పోటీ పరీక్షలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.